క్లుప్తంగా

కుమారస్వామికి విశేష పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం సందర్భంగా అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

రెండు గ్రామాల మధ్య నీటి వివాదం

మహానంది: తెలుగుగంగ కాల్వ నుంచి వచ్చే నీటి విడుదల, పంపకాల విషయంలో రెండు గ్రామాల మధ్య నెలకొన్న వివాదం పోలీస్‌స్టేషన్‌కు చేరింది. తమ్మడపల్లె, బొల్లవరం గ్రామాల రైతులు సాగు చేసే పంటపొలాలకు తెలుగుగంగ ఉప కాల్వ జమాలయ్యదర్గా వద్ద నుంచి వెళ్లాల్సి ఉంది. అయితే రెండు గ్రామాలకు చెందిన రైతుల మధ్య గత కొన్ని రోజులుగా వివాదం నెలకొంది. మాకు ఇన్ని, మీకు ఇన్ని నీళ్లు అంటూ మాటామాటా పెరగడంతో అధికారులు సైతం వచ్చి మ్యాపులు చూపించి నిర్ధారించారు. అయినా వివాదం సద్దుమణగకపోవడంతో రెండు గ్రామాలకు చెందిన సుమారు వంద మంది రైతులు మంగళవారం రాత్రి పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ విచారణ చేస్తున్నారు.

4న సర్వసభ్య సమావేశం

పాములపాడు: ఈ నెల 4న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గోపీకృష్ణ తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీ టీసీ, సర్పంచులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమగ్ర ప్రగతి నివేదికలతో హాజరుకావాలని వివరించారు.

సారా విక్రేతల అరెస్ట్

మహానంది: మహానంది, పచ్చర్ల గ్రామాల్లో నాటుసారా విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ మంగళవారం తెలిపారు. పచ్చర్ల గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, మహానందికి చెందిన మోహన్‌గౌడును అరెస్ట్ చేసి ఒక్కొక్కరి వద్ద పదిలీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఇద్దరిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు వెల్లడించారు.

కోలుకోలేక యువతి మృతి

నందికొట్కూరు: కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ యువతి మృతి చెందిన సంఘటన మంగళవారం వేకుజామున చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య తెలిపిన మేరకు వివరాలు.. పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన జమాల్‌బీ, అబ్దుల్ హమీద్‌ఖాన్‌ల కుతూరు రహిమఖాతూన్ (21) తరుచూ వస్తున్న కడుపు నొప్పి తట్టుకోలేక అక్టోబర్ 23న ఇంటి వద్ద పురుగుల మందు తాగింది. తల్లిదండ్రులు స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా ప్రథమ వైద్య చికిత్సలు అందించి కర్నూలుకు ప్రభుత్వ వైద్యశాలకు రెఫర్ చేశారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందింది. తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తునట్లు తెలిపారు.

శ్రీపతిరావు పేటలో భారీ అగ్నిప్రమాదం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ఆత్మకూరురూరల్: మండలంలోని శ్రీపతిరావు పేట గ్రామంలో మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఒక నివాస గృహంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో చెలరేగిన మంటలు చుట్టూ ఉన్న పశువుల పాకలకు వ్యాపించడంతో భారీ నష్టం చోటు చేసుకుంది. సుబ్బమ్మ అనే మహిళ ఇంట్లో దాచుకున్న 5 తులాల బంగారం, రూ.50వేల నగదు, వంట సామగ్రి అగ్నికి ఆహుతయ్యాయి. ప్రభాకరరెడ్డి అనే రైతుకు చెందిన పశువుల పాకలో ఉన్న ఒక ఎద్దు, ఒక బర్రె, మూడు దూడలు సజీవ దహనమయ్యాయి. వీటివిలువ సుమారు రూ.మూడు లక్షల వరకు ఉంటుందని అంచనా. లక్ష్మిరెడ్డి అనే వ్యక్తి పశువుల పాక కూడా ఈ ప్రమాదంలో పూర్తిగా కాలిపోయింది. సమాచారం అందుకున్న ఆత్మకూరు అగ్నిమాపక శకటం గ్రామానికి చేరుకొని మంటలు వ్యాప్తి చెందకుండా అదుపుతోకి తెచ్చారు. ఆత్మకూరు ఎస్‌ఐ నారాయణ రెడ్డి సంఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

సారా తయారు చేస్తే కేసులు

నందికొట్కూరు: నాటు సారా తయారు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ ఎస్వీ రమణ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని నీలిషికారిపేటలో నాటుసారా తయారు చేస్తున్న, విక్రయిస్తున్న వారి ఇళ్లపై జిల్లా అధికారుల ఆదేశాల మేరకు సీఐ ప్రకాష్‌కుమార్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. బెల్లం ఊటను పోలీసులు ధ్వంసం చేసి, 20 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని షికారి శ్రావంత్, రవి, సుగుణమ్మ, రాజమ్మపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నిరుపేదల ఆరోగ్యానికి 'జగనన్న సురక్ష'

- ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు చేయించుకోవాలి
- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- ఆత్మకూరులో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం



షుగర్ పరీక్ష చేయించుకుంటున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

ఆత్మకూరు: నిరుపేదలకు వరం జగనన్న ఆరోగ్య సురక్ష అని ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి అన్నారు. పట్టణంలోని ఎస్పీజీపాలెం సచివాలయం -1లో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వార ప్రజల ఇళ్ల వద్దకే వైద్య సేవలు అందుతున్నట్లు చెప్పారు. 15 వేల సచివాలయాల పరిధిలో డాక్టర్లు, గ్రామాలకు, పట్టణానికి వెళ్లి అక్కడ ప్రజల ఇళ్ల వద్ద వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. 175 రకాల మందులు అందించడమే కాకుండా ఖరీదైన మందులు సైతం అందిస్తున్నామని చెప్పారు. బండిఆత్మకూరు మండలం ఈర్నపాడు గ్రామంలో తనకు దగ్గు రావడంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మందులు తీసుకుని ఉపయోగించానని, మందులకు దగ్గు వెంటనే తగ్గిందని నాణ్యమైన మందులు అందిస్తున్నామని చెప్పారు.

10వేల మంది డాక్టర్లతో కార్యక్రమం

రాష్ట్రంలో 10 వేల మంది డాక్టర్లతో వివిధ రకాల సిబ్బంది కోటి 60 లక్షల కుటుంబాలకు వైద్య పరీక్షలు అందిస్తున్నామని ఎమ్మెల్యే చెప్పారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా ఈ పథకాల ను అందిస్తూ పేదల హృదయాలను దోచుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, ఈ కార్యక్రమం పేదలకు ఓ వరం అన్నారు. కుటుంబంలోని ప్రతి ఒక్కరు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఇటీవల శ్రీశైలంలో మాజీ సీబీఐ జేడీ లక్ష్మీనారాయణ ముఖ్యమంత్రి అమలు చేస్తున్న వైద్య, విద్య రంగాల పథకాలను ప్రశంసించారని చెప్పారు. అంతకుమునుపు పలువులు ఎమ్మెల్యే శిల్పాకు దుస్సాలువా, పూలమాలతో ఘనస్వాగతం పలికారు. వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన స్టాల్స్‌పరిశీలించారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్ ప్రసంగించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు సయ్యద్ మీర్, రాజమోహన్‌రెడ్డి, పువ్వాడ భాస్కర్, షరీఫ్, సుల్తాన్, కలిముల్లా, బైరాపురం మహబూబ్‌బాషా దితరులు పాల్గొన్నారు,

ముగిసిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌లు

పగిడ్యాల: మండలంలోని పది గ్రామ సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌లు ముగిసినట్లు ఎంపీడీఓ వెంకటరమణ తెలిపారు. చివరి రోజైన మంగళవారం లక్ష్మాపురం-3 సచివాలయం పరిధిలోని ఎం. ఘణపురం గ్రామంలో సర్పంచ్ ప్రతాపరెడ్డి అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జెడ్పీటీసీ పుల్యాల దివ్య, ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి, ఎంపీటీసీ దాసరి ప్రియాంక, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, మాజీ జెడ్పీటీసీ పుల్యాల నాగిరెడ్డి హాజరయ్యారు. వైద్య శిబిరంలో 680 మందికి డాక్టర్లు క్రిష్ణమూర్తి, శ్వేత, విలాయత్, అనిల్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, మోహన్‌లు పరీక్షలు నిర్వహించారు. అత్యవసర వైద్యం నిమిత్తం 10మందిని ఆరోగ్య శ్రీ కింద కర్నూలుకు రెఫర్ చేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నాగేంద్రయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శేషమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, దాసరి బాబు, భాస్కర్, నాగమల్లయ్య, ఎల్లన్న, నాయక్ తదితరులు పాల్గొన్నారు.



మెడికల్ కిట్లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ పుల్యాల దివ్య, ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి

పేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్



బాధిత కుటుంబానికి చెక్కును అందజేసిన ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

నందికొట్కూరు: ఆపదలో ఉన్న పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ పథకం ఓ వరమని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ స్పష్టం చేశారు. మంగళవారం పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టణంలోని ఆయూష్‌బాషాకు రూ. 70 వేలు, బ్రాహ్మణకొట్కూరుకు చెందిన లలితమ్మకు రూ.1. 30లక్షలు ప్రభుత్వం మంజూరు చేసిన చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్ షుకూర్, సర్పంచ్ మద్దిలేటి, వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ రాజు, హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ ఫెస్టివల్‌ను విజయవంతం చేయండి

నందికొట్కూరు: ఫుడ్ ఫెస్టివల్‌ను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఫుడ్ ఫెస్టివల్ పోస్టర్లను ఎమ్మెల్యే, ఉర్దూ అకాడమీ రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్ షుకూర్, మత్స్యశాఖ అధికారి భరత్ నాయక్ విడుదల చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కర్నూలు పట్టణంలోని రావూరి గార్డెన్స్‌లో మత్స్యశాఖ ఆధ్వర్యంలో 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు ఫుడ్ ఫెస్టివల్ జరుగుతునట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధే ధ్యేయం



మాట్లాడుతున్న చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి

నందికొట్కూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పట్టణాభివృద్ధికి పెద్ద పీట వేశారని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని జైకిసాన్ పార్కులో ఏర్పాటు చేసిన మున్సిపల్ సాధారణ సమావేశంలో పట్టణ అభివృద్ధిపై ప్రజాప్రతినిధులు చర్చించారు. చైర్మన్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రభుత్వం పట్టణాభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించిందన్నారు. రాష్ట్ర శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ప్రత్యేక చొరవతీసుకొని కాలనీలను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక నిధులు తెచ్చారని గుర్తు చేశారు. సమావేశంలో కమిషనర్ కిషోర్, వైస్ చైర్మన్లు రబ్బానీ, ప్రశాంతి, డీఈ నాయబ్ రసూల్, టీపీఓ బాలమద్దయ్య, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



స్టాక్‌రూంను తనిఖీ చేస్తున్న డీసీఓ శ్రీదేవి

జూపాడుబంగ్లా: అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని డీసీఓ శ్రీదేవి సూచించారు. మంగళవారం ఆమె జూపాడుబంగ్లా అంబేడ్కర్ గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. క్వార్టర్లీ పరీక్షల్లో విద్యార్థులు సాధించిన మార్కులు, వారి ప్రతిభ వివరాలను నిపుణుల బృందంతో పరిశీలించారు. అలాగే పాఠశాల పరిసరాలను, భోజనశాలను తనిఖీ చేశారు. పాఠశాల, భోజనశాల పరిసరాలను మరింత పరిశుభ్రంగా ఉంచాలని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారంగా నాణ్యమైన భోజనం వండిపెట్టాలని వార్డెన్ గిరిధర్‌కు సూచించారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ గతేడాది పదోతరగతి, ఇంటర్ వార్షిక పరీక్షల్లో కొంత ఉత్తీర్ణత శాతం తగ్గిన మాటవాస్తవమేనన్నారు. ఈ ఏడాది గతేడాది కంటే మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయుల సహకారంతో ప్రిన్సిపాళ్లు తగిన ప్రణాళికలు సిద్ధం చేసుకొని, అందుకు అనుగుణంగా విద్యాబోధన చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాల్లోని గురుకుల పాఠశాలల్లో జేఈఈ, ఎంసెట్ రాయదలచిన విద్యార్థులకు అవసరమైన మెటీరియల్‌తో పాటు ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సత్యనారాయణమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ పరమేశ్వరప్ప, లైబ్రేరియన్ కంబయ్య పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో మేలైన దిగుబడులు



వరిలో తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఆత్మ బీటీఎం ఉమామహేశ్వరి

జూపాడుబంగ్లా: సస్యరక్షణ చర్యలతో వరి, మినుము పంటలలో దిగుబడులు మెండుగా సాధించవచ్చని ఆత్మ బీటీఎం ఉమామహేశ్వరి, ఏఓ కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని తంగడంచ, తరిగోపుల గ్రామాల్లో వరి, మినుము పంటల్లో సస్యరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. మినుము పంటలో చీడ, పీడలు వ్యాపించినప్పుడు మాత్రమే రైతులు తగిన మోతాదులో రసాయనిక మందులను పిచికారీ చేసుకోవాలన్నారు. పంటలో పురుగులు వ్యాపించకుండా తెలుపు, పసుపు, నీలం రంగు జిగురు అట్టలను పంట కన్నా అడుగు ఎత్తులో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పంటలో చీడ పీడల వివరాలను ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి సలహాలు, సూచనల మేరకు అవసరమైన మందులను పిచికారీ చేసుకోవాలని తెలిపారు. అలాగే వరి పంటలో ఎలుకల బెడద నివారణకు బ్రోమాడియోలోన్ మందును నూకలు, తవుడు, బియ్యంలో కలుపుకొని గట్లలో, ఎలుకల కలుగుల వద్ద వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పుల్లయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మండలాభివృద్ధే లక్ష్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా

ఆత్మకూరు: మండల అభివృద్ధే తమ లక్ష్యమని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ తిరుపాలమ్మ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఏడాది వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో అధికారులు ఇప్పటి నుంచే అన్ని గ్రామాల్లో మంచినీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు పంటలు ఎండిపోకుండా విద్యుత్ సరఫరా అందించడమే కాకుండా, గ్రామంలో కొత్త విద్యుత్‌పోల్, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామని, సిద్ధాపురం చెరువు కింద పంటలు ఎండిపోకుండ తమ సొంత నిధులు రూ.2 లక్షలు వెచ్చించి ఎత్తిపోతల పథకానికి మరమ్మతులు చేసి నీటిని విడుదల చేశామని చెప్పారు. వెలుగోడులోని తెలుగు గంగ ప్రాజెక్ట్‌లో 9 టీఎంసీల కంటే నీరు తక్కువగా ఉంటే సిద్ధాపురం చెరువుకు నీటిని విడుదలకు అవకాశం ఉండదన్నారు. దీంతో యుద్ధ ప్రాతిపదికన పోతిరెడ్డిపాడు నుంచి నీటిని విడుదల చేసి, సిద్ధాపురం చెరువుకు నీటిని వదిలామని వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మోహన్‌కుమార్, ట్రాన్స్‌కో డీఈ రమేష్, ఎంఈఓ జానకీరాం, వైకేపీ ఏపీఎం ఉమాదేవి, తహసీల్దార్, ఉమాదేవి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

శిక్షణకు హాజరుకండి

పాములపాడు: ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంపై నిర్వహిస్తున్న శిక్షణ శిబిరానికి వైఎస్సార్‌సీపీ శ్రేణులు హాజరుకావాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రామలింగేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ఆదేశాల మేరకు బుధవారం స్థానిక నారాయణరెడ్డి డిగ్రీ కళాశాలలో ఉదయం 10.30 గంటలకు శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. పార్టీ మండల కన్వీనర్, జేసీఎస్ కన్వీనర్, ఐ ప్యాక్‌టీం ఆధ్వర్యంలో ఈ శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

కార్మిక హక్కుల సాధనకు పోరాటం

ఆత్మకూరు: కార్మిక హక్కుల సాధనకై పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శ్రీనివాసులు అన్నారు. పట్టణంలోని గౌడ్‌సెంటర్ మంగళవారంలో ఏఐటీయూసీ 104వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. పట్టణంలోని ప్రధా న సెంటర్లలో ఏఐటీయూసీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో ప్రసాద్, అబ్దుల్లా, చాంద్‌బా షా, ఓబులేసు, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లోని సమస్యలపై అవగాహన ఉండాలి

జూపాడుబంగ్లా: గ్రామాల్లోని సమస్యలపై గ్రామసచివాలయాల మహిళా సంరక్షణ కార్యదర్శులు(జీఎంఎస్‌కే) అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ మారుతిశంకర్ అన్నారు. మంగళవారం జూపాడుబంగ్లా పోలీసుస్టేషన్‌లో మండలంలోని జీఎంఎస్‌కేలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ గ్రామాల్లో నేరచరిత్ర కలిగిన వ్యక్తుల వివరాలు, వారి ప్రవర్తనపై ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకోవాలన్నారు. అలాగే స్థానిక పోలీసుస్టేషన్ ఎదుట కేజీరోడ్డుపై డ్రంకెన్ డ్రైవ్ తనిఖీ నిర్వహించారు.

అక్రమ మద్యం విక్రేత అరెస్టు

జూపాడుబంగ్లా: అక్రమంగా మద్యం, నాటుసారా విక్రయిస్తున్న నాగినేని శివయ్య అలియాస్ మేదర శివ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని, అతని నుంచి ఐదులీటర్ల నాటుసారా, ఐదు మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ మారుతిశంకర్ తెలిపారు. మంగళవారం రాత్రి 8.30గంటల ప్రాంతంలో సమాచారం మేరకు కేసీ కాల్వ బ్రిడ్జి వద్ద దాడులు నిర్వహించి అక్రమంగా నాటుసారా, మద్యం విక్రయిస్తున్న మేదర శివను పట్టుకున్నామన్నారు. అతని నుంచి ఐదు మద్యం సీసాలు, ఐదులీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నామన్నారు. అతనిపై కేసు నమోదుచేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు వెల్లడించారు.

ఉద్యోగులు సమయపాలన పాటించాలి



రైతులకు ఎలుకల నివారణ మందు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

మహానంది: సచివాలయాల్లో పనిచేసే సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని, కొన్ని సచివాలయాల్లో నిర్ణీత వేళలకు రాకుండా నిర్లక్ష్యంగా ఉన్నారని ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని అన్నారు. బుక్కాపురంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఇటీవల పలు గ్రామాలను సందర్శించినప్పుడు సచివాలయ ఉద్యోగులపై ఫిర్యాదులు అందాయన్నారు. సచివాలయ ఉద్యోగులు పనినిమిత్తం బయటికి వెళ్లినప్పుడు మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. గ్రామాల్లో విద్యుత్ ప్రమాదాలను అరికట్టేందుకు విద్యుత్‌శాఖ సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. పలు గ్రామాల్లో, పంటపొలాల వద్ద తీగలు కిందకి వేలాడుతున్నాయని, వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. సమావేశంలో పంటపొలాల్లో ఎలుకల నివారణ కోసం వినియోగించే బ్రోమోడయాలోన్ మందును ఏఓ నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, తహసీల్దార్ జనార్దన్‌శెట్టి, ఎంపీడీఓ శివనాగజ్యోతి, వైస్ ఎంపీపీ కుంచపు లక్ష్మీనరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం

కొత్తపల్లి: కార్మిక సమస్యలపై ప్రతి ఒక్కరూ అలుపెరుగని పోరాటం చేయాలని ఏఐటీయూసీ మండల కార్యదర్శి కేతం వెంకటశివుడు యాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఏఐటీయూసీ కార్మిక సంఘం 104వ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా కార్మికవర్గ ఎర్రజెండాను ఎగురవేశారు.

ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్





పటేల్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న మున్సిపల్ చైర్మన్, ప్రతిజ్ఞ చేస్తున్న ఐటీడీఏ పీఓ, ఉద్యోగులు

నందికొట్కూరు: స్వాతంత్ర్య సమరయోధుడు ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలు మరవలేనివని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పటేల్ జయంతి సందర్భంగా పట్టణంలోని ఆయన విగ్రహానికి మున్సిపల్ కౌన్సిలర్లు, బీజేపీ రాష్ట్ర నాయకులు చల్లా దామోదర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పటేల్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిషోర్, వైస్ చైర్మన్ ప్రశాంతి, కౌన్సిలర్లు చాంద్‌బాషా, హమీద్, లాలు, నాయబ్, రూపాదేవి, మంగళి కృష్ణ, సమీరాబాను, కో ఆప్షన్ సభ్యులు గఫార్, రాధిక తదితరులు పాల్గొన్నారు.

పగిడ్యాల: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధుసూదన్‌రావు, ఎం. ఘణపురం సచివాలయం వద్ద సర్పంచ్ ప్రతాపరెడ్డి ఆధ్వర్యంలో వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఎంపీడీఓ వెంకటరమణ, ఈఓఆర్డీ నాగేంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: మండల పరిధిలోని గోకవరం గ్రామంలోని భక్తకన్నప్ప గురుకుల ఆవాసంలో జాతీయ సమైక్యత దినోత్సవం సందర్భంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆవాస కో-ఆర్డీనేటర్ చిలుకల వాసుదేవరెడ్డి, ఆవాస ప్రముఖ రామకృష్ణ పాల్గొన్నారు.

మహానంది: బండిఆత్మకూరు మండలం పార్నపల్లెలో మంగళవారం పార్నపల్లె సర్పంచ్ షేక్ షబ్బీర్ అహమ్మద్ ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా జాతీయ ఏకతా దివస్ ప్రతిజ్ఞ చేయించారు.

శ్రీశైలంప్రాజెక్ట్: స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ప్రాజెక్ట్ అధికారి డా.బి రవీంద్రారెడ్డి, ఏపీఓ ఎ.సురేష్‌కుమార్, డీఈ లత, అధికారులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ పి.హుస్సేన్‌బాషా, అధ్యాపకులు ఉక్కుమనిషి సర్దార్‌వ ల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో మంగళవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ వెంకటనరసయ్య పటేల్ సేవలను కొనియాడారు.

అసమానతలు లేని అభివృద్ధి కోసం ప్రజా రక్షణభేరి



మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ గఫూర్

ఆత్మకూరు: అసమానతలు లేని అభివృద్ధి కోసమే ప్రజా రక్షణ భేరీ కార్యక్రమం చేపట్టామని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు గఫూర్, ఆ పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని పాతబస్టాండ్ లో మంగళవారం ప్రజా రక్షణ భేరీ బస్సు జాతా బహిరంగ సభ నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేసిందని, కార్మిక హక్కులను కాలరాసిందన్నారు. పెట్టుబడిదారులకు, కార్పొరేట్ సంస్థల కోసం ఉద్యోగ వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చేందుకు కృషి చేసిందని చెప్పారు. నవంబర్ 15న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర నాయకులు ఉమామహేశ్వరరావు, శివనాగరాణి, రమాదేవి, భాస్కరయ్య, అనీల్, నంద్యాల జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్, కార్యదర్శి వర్గ సభ్యులు ఏసురత్నం, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

లడ్డూ ప్రసాద కౌంటర్ సిబ్బంది సమస్య పరిష్కారం




ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డితో వీడియో కాల్‌లో మాట్లాడుతున్న లడ్డూ కౌంటర్ సిబ్బంది

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం లడ్డూ ప్రసాద కౌంటర్ సిబ్బందిని సమస్యలను ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పరిష్కరించారు. దసరా మహోత్సవాలను పురస్కరించుకుని శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించేందుకు అక్టోబరు 23న ఎమ్మెల్యే శ్రీశైలం వచ్చారు. ఈ సందర్భంగా దేవస్థానంలోని లడ్డూ కౌంటర్ల సిబ్బందికి ఏడు నెలలుగా వేతనాలు రావడం లేదనే విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు సోమవారం విజయవాడలోని దేవదాయశాఖ ఉన్నతాధికారుల కార్యాలయానికి వెళ్లి లడ్డూ కౌంటర్ సిబ్బంది సమస్యలను వివరించారు. దీంతో ఉన్నతాధికారులు తక్షణమే సమస్యను పరిష్కరించారు. మంగళవారం శ్రీశైలంకు చెందిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ కార్యాదర్శి ఎంఏ.రజాక్‌కు ఎమ్మెల్యే ఫోన్ చేసి లడ్డూ కౌంటర్ సిబ్బంది సమస్యను పరిష్కరించానని తెలియజేశారు. తమ సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డికి వీడియో కాల్ ద్వారా లడ్డూ కౌంటర్ సిబ్బంది ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బకాయిల చెల్లింపు తోపాటు వేతనం పెంపు

లడ్డూ కౌంటర్ సిబ్బందితో ఎమ్మెల్యే శిల్పా మాట్లాడుతూ 7 నెలల వేతనం చెల్లించడంతో పాటు లడ్డూ కౌంటర్‌లో విధులు నిర్వహిస్తున్న 15 మంది సిబ్బందికి గతంలో ఇస్తున్న (అన్ని కటింగ్‌లు పోను) రూ.11,800 వేతనాన్ని సుమారు రూ.16వేలకు పెంచుతున్నట్లు వివరించారు. తమ సమస్యను పరిష్కరించడంతో పాటు వేతనాలు పెంపుదల కూడా చేయడంతో లడ్డూ కౌంటర్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఆనందానికి అవధులు లేవు.

వరిలో సామూహిక ఎలుకల నివారణ



గువ్వలకుంట్లలో విషపు ఎరను తయారు చేసే విధానాన్ని వివరిస్తున్న ఏడీఏ, శాస్త్రవేత్తలు

కొత్తపల్లి: మండలంలోని గువ్వలకుంట్ల గ్రామ సమీపంలోని వరి పొలాల్లో సామూహిక ఎలుకల నివారణపై మంగళవారం ఆత్మకూరు ఏడీఏ బి.ఆంజనేయ రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సామూహిక ఎలుకల నివారణకు అవసరమైన విషపు ఎర తయారి విధానం వివరించారు. ఎలుకల నివారణకు ఒక కేజీ విషపు ఎరను ఏవిధంగా తయారు చేసుకోవాలని చెప్పారు. 960 గ్రాముల బియ్యపు నూకలు, 20 గ్రాముల నూనె, 20 గ్రాముల బ్రోమో డయోలిన్ మందును కలిపి తయారు చేసుకోవాలని సూచించారు. ఎట్టిపరిస్థితుల్లోనూ ఈ పదార్థాన్ని చేతులతో తాకరాదని, చిన్నపిల్లలకి దూరంగా ఉంచాలని హెచ్చరించారు. వీటిని చిన్న చిన్న పొట్లాల్లో కట్టి పొలాల వద్ద ఎలుకల బొరియల వద్ద ఉంచాలని సూచించారు.

వరిలో సుడిదోమ నివారణ

ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త మంజునాథ్ మాట్లాడుతూ వరిపొలాల్లో సుడిదోమ గుర్తించామని చెప్పారు. సుడిదోమ ఆశించినట్లయితే పొలంలో పైరు సుడులు సుడిగా ఎండిపోవడం జరుగుతుందన్నారు. దీని నివారణకు ఇతోఫెస్ ప్రాక్స్ 2.0 ఎంఎల్, ఎసిఫేట్ 1.5 గ్రాములు, ఇమిడాక్లోప్రేడ్, ఎథిప్రోలు 80 డబ్ల్యూజీ 25 గ్రాములు, పైమేట్రోజెన్ 0.6 గ్రాములు, డైనోటోఫ్యురాన్ 20 ఎస్‌జీ 0.4 గ్రాములు లేదా ట్రైఫ్లూమీజోపైరం 0.48 గ్రాములను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాంతీయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త రవికుమార్, జిల్లా వనరుల కేంద్ర వ్యవసాయ అధికారి హేమలత, ఏఓ కె.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎలుకల నివారణపై అవగాహన

నందికొట్కూరు రూరల్: మండలంలోని రైతులు సాగు చేసిన పంటలలో ఎలుకలు, చీడపీడల నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఏడీఏ విజయశేఖర్, ఏఓ షేక్షావలి సూచించారు. మంగళవారం మల్యాల గ్రామంలో రైతులకు ఎలుకల నివారణ పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. అలాగే గ్రామాల్లో ఆయా మండలాల వ్యవసాయాధికారులు సామూహిక ఎలుకల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు.